# తడిసిన ధాన్యం మద్దతు ధరకే సేకరణ

**వరద బాధితులకు ప్రభుత్వం పూర్తి స్థాయి సహాయం**

**అక్టోబర్ 29న రికార్డు స్థాయి వర్షాలకు రైతులకు భారీ నష్టం**

**పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం**

**పంట నష్టపరిహారం, మౌలిక వసతుల పునరుద్ధరణకు చర్యలు**

**పట్టణంలో డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి రూ.80 కోట్ల డీపీఆర్ సిద్ధం**

**రాష్ట్ర రవాణా, బీసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



హుస్నాబాద్, జనత న్యూస్:ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులు, ప్రజలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తుందని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.అయన మాట్లాడుతూ... అక్టోబర్ 29న జిల్లాలో కురిసిన రికార్డు స్థాయి వర్షాలకు పంటలు, రహదారులు, కల్వర్టులు, ఇళ్లు భారీగా దెబ్బతిన్నాయని మంత్రి పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు నాశనమయ్యాయని తెలిపారు.వర్షాల కారణంగా రైతులు పడిన నష్టాన్ని అంచనా వేసేందుకు స్వయంగా తాను జిల్లా కలెక్టర్ కె.హైమావతితో కలిసి హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డు,పలు గ్రామాలను సందర్శించినట్టు మంత్రి తెలిపారు. వర్షాలకు తడిసిన వరిధాన్యాన్ని రైతులు నష్టపోకుండా ప్రభుత్వం మద్దతు ధరతోనే సేకరించి రైస్ మిల్లులకు తరలిస్తున్నామని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హుస్నాబాద్ పరిధిలో పంట నష్టాన్ని ఏరియల్ సర్వే ద్వారా స్వయంగా పరిశీలించారని, అధికారులు సమగ్ర నివేదికను సమర్పించారని తెలిపారని...ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా ఎకరానికి రూ.10వేల చొప్పున పంట నష్టపరిహారం రైతులకు అందించబడుతుందని మంత్రి వెల్లడించారు.హుస్నాబాద్ పట్టణంలో భవిష్యత్తులో వరద సమస్యలు తలెత్తకుండా మురుగు, వరదనీటి డ్రైనేజీ వ్యవస్థ, రహదారి నిర్మాణ పనుల కోసం రూ.80 కోట్ల రూపాయలతో డీపీఆర్ సిద్ధం చేసినట్టు తెలిపారు. అదేవిధంగా దెబ్బతిన్న పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి రహదారులు, కల్వర్ల పునరుద్ధరణ పనులు తక్షణమే ప్రారంభించనున్నట్టు మంత్రి తెలిపారు.ప్రభుత్వం బాధిత రైతుల పక్షాన పూర్తిగా నిలబడి, ప్రతి నష్టపోయిన కుటుంబాన్ని ఆదుకునేందుకు కట్టుబడి ఉంది. ఎవ్వరూ అధైర్యపడవలసిన అవసరం లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా ఇచ్చారు.

# దెబ్బతిన్న పంటలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి

**సిపిఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి**



చిగురుమామిడి, జనత న్యూస్:
ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా రైతుల పంటలు తీవ్రంగా దెబ్బతిన్న నేపథ్యంలో, ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.శనివారం చిగురుమామిడి మండలంలోని రేకొండ గ్రామంలో వరి పంటల నష్టం, చెడిపోయిన రోడ్లు, లో లెవెల్ బ్రిడ్జిలను సిపిఐ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ... భారీ వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. కోతకు సిద్ధమైన వరి పంటలు నీలమట్టమయ్యాయి. ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసిపోయి రైతులు నష్టపోయారు. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పండించిన పంటలు ప్రకృతి వైపరీత్యంతో నాశనం కావడం రైతులపై తీవ్ర భారమైందని అన్నారు.పంటలు నష్టపోయిన ప్రతి రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని తక్షణమే అందించి రైతులకు భరోసా కల్పించాలి. సంబంధిత అధికారులు వెంటనే క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించి అంచనా నివేదికను సమర్పించాలి అని ఆయన కోరారు.రేకొండ,పెద్దమ్మపల్లి మార్గంలోని 1984లో నిర్మించిన లో లెవెల్ బ్రిడ్జి దెబ్బతిన్నదని, రేకొండ,ఏక్లాస్‌పూర్ మార్గంలో మూడు సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేసిన బ్రిడ్జి ఇప్పటికీ పూర్తి కాలేదని ఆయన పేర్కొన్నారు. రేకొండ,మొగిలిపాలెం మార్గంలో కూడా కొత్త బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరం ఉంది. రోడ్లకు ఇరువైపులా గండ్లు పడి, మట్టి కొట్టుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని తెలిపారు.అలాగే భారీ వర్షాల వల్ల కొంతమంది ఇళ్లు కూలిపోయినట్టు గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, పశువులు చనిపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వరదకాలువ ఫేస్ త్రీలో కల్వర్ట్ పనులు పూర్తి చేయకపోవడం వల్ల పంట పొలాల్లోకి నీరు చేరి నష్టం కలుగుతోందని పేర్కొన్నారు.పంటల నష్టం, బ్రిడ్జిలు, రోడ్ల సమస్యలను సంబంధిత శాఖల అధికారులు, మంత్రుల దృష్టికి తీసుకువెళ్తాను అని చాడ వెంకటరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బోయిని సర్దార్ వల్లభభాయ్ పటేల్, సింగిల్ విండో డైరెక్టర్లు చాడ శ్రీధర్ రెడ్డి, ముద్రకోల రాజయ్య, మాజీ ఎంపీటీసీ పరకాల కొండయ్య, సిపిఐ పెద్దమ్మపల్లి శాఖ కార్యదర్శి నీల వెంకన్న, నాయకులు తమ్మిశెట్టి రవీందర్, విలాసాగరం అంజయ్య, రాచర్ల రంగయ్య, బోయిని రాజు, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి చెంచల రవితదితరులు పాల్గొన్నారు.

# రైతులకు 50 వేల నష్టపరిహారం ఇవ్వాలి

**– బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్**



హుస్నాబాద్,జనత న్యూస్: మండలంలోని మడద గ్రామంలో బీఎస్పీ నియోజకవర్గ ఇన్చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ అధ్వర్యంలో శనివారం బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నేతలు నష్టపోయిన పంటలను పరిశీలించారు. గ్రామంలోని రైతులు ఉప్పుల లక్ష్మి, పత్తి రాజు, రాగుల సత్యం తదితరుల వరి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని గుర్తించారు. వరి కోత దశకు వచ్చినా నీటి ప్రవాహం తగ్గకపోవడంతో పంట మొలకలు రావడం ప్రారంభమైందని, రైతులు భారీ నష్టాలను ఎదుర్కొంటున్నారని నేతలు తెలిపారు.ఈ నేపథ్యంలో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు రూ.50వేల చొప్పున తక్షణ ఆర్థిక సహాయం అందించాలంటూ బీఎస్పీ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. అదేవిధంగా వరి, మొక్కజొన్న విత్తనాలు, ఎరువులు వంటి వ్యవసాయ ఇన్పుట్లను ప్రభుత్వం ఉచితంగా అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా నాయకులు వెంకటేష్, ఎలగందుల శంకర్, జేరి పోతుల రవీందర్, నియోజకవర్గ అధ్యక్షుడు వెలుపల రాజు, పార్టీ నాయకులు బోయిన బాబు, హనుమంతు, దుంద్ర రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల నష్టాన్ని ప్రభుత్వం భరించాలి

**మండల బిజెపి డిమాండ్.**




జనతన్యూస్ బెజ్జంకి : మెంథా తుపాన్ తో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, వారి నష్టాన్ని ప్రభుత్వం భరించాలని మండల బిజెపి పార్టీ శ్రేణులు పార్టీ మండల అధ్యక్షులు కొలిపాక రాజు, రాష్ట్ర కిషన్ మోర్చా కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డిల ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కు శనివారం మెమోరండం సమర్పించినట్లు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకాల వర్షంతో మండలంలో రైతులకు తీవ్రంగా నష్టం జరిగిందని, ఆరుగాలం కష్టించిన పంట నీటి పాలు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి విపత్తుల ద్వారా రైతులు నష్టపోకుండా, పంట బీమా ప్రభుత్వం చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుర్ర మల్లేశం గౌడ్, కొత్తపేట రామచంద్రం, గైని శ్రీనివాస్ గౌడ్, బోయినిపెల్లి అనిల్ రావు, బుర్ర కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మగౌరవ ర్యాలీకి బెజ్జంకి దళిత నాయకులు



జనతన్యూస్ బెజ్జంకి : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ పై జరిగిన దాడిని ఖండిస్తూ శనివారం హైదరాబాదులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నిర్వహించే దళితుల ఆత్మగౌరవ మహాప్రదర్శన ర్యాలీకి మండలం నుండి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, పి హెచ్ పి ఎస్ సంఘాల నాయకులు తరలి వెళ్లినట్లు ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జ్ చింతకింది పరశురాములు పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీకి వెళ్లిన నాయకులు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు వడ్లూరి పరశురాములు, మోదుంపల్లి రాజు, కంపెల్లి రాజు, మంకాల బాలయ్య, బెజ్జంకి శంకర్, మంకాల రాజు తదితరులు వెళ్లినట్లు తెలిపారు.

# రైతులకు తక్షణ నష్టపరిహారం ఇవ్వాలి

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య**



చిగురుమామిడి,జనత న్యూస్: తుఫాన్ వల్ల తీవ్ర నష్టాలు ఎదుర్కొన్న రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలంటూ చిగురుమామిడి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య డిమాండ్ చేశారు. శనివారం బొమ్మనపల్లి, ఉల్లంపల్లి గ్రామాల్లో పంట నష్టాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో నివేదికలు తయారు చేయలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బీసీ మంత్రులుగా ఉన్న రాష్ట్ర మంత్రి ప్రభాకర్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌లు రైతులకు భరోసా ఇవ్వడంలో విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కదలిక చూపకపోతే ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాగర్ రెడ్డి, కత్తుల రమేష్, మిట్టపల్లి మల్లేశం,పేనుకుల తిరుపతి, తోట శ్రీనివాస్, గంప నాగరాజు, మామిడి వెంకటయ్య, పె%శీ%డల సదానందం, రావుల వెంకటయ్య, జనవేని సమ్మయ్య, కానవేని ఓదయ్య, కొత్త బాలయ్య, కోలా చంద్రయ్య, వెంకవ్వ, కొత్త తిరుపతి, కొండ మల్లికార్జున్, కానవేణి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

